కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -218 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 19-08-2026 బుధవారం పేజీలు : 4

# ఓటర్ల లెక్కల్లో భారీ ట్విస్ట్!

- హైదరాబాద్‌లోనే 43 లక్షల ఓటర్లు!
- ఏఎస్‌డీడీ జాబితాలో హైదరాబాద్ హవా
- మొత్తం రాష్ట్రంలో 73.3 లక్షల మంది
- మెట్రో జిల్లాల్లో భారీగా ఓటర్ల తొలగింపు
- శాశ్వతంగా తరలిపోయిన వారే ఎక్కువ
- శేరిలింగంపల్లిలో 42.6 శాతం ఓటర్లు
- పాతబస్తీకే పరిమితం కాని తొలగింపులు
- శివారు నియోజకవర్గాల్లోనూ భారీ మార్పులు
- ఓటర్ల జాబితాలో సంచలన గణాంకాలు




**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి.. సోమవారం విడుదల చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 73.3 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌డీడీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) కేటగిరీలో ఉన్నట్లు వెల్లడించారు. అందులో ఏకంగా 43 లక్షల మంది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నట్లు తాజాగా ఎన్నికల అధికారులు వెల్లడించారు. అంటే రాష్ట్రంలోని ఏఎస్‌డీడీ ఓటర్లలో దాదాపు 58.6 శాతం మంది హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలకు చెందినవారే కావడం గమనార్హం.

తెలంగాణలో మొత్తం ఓటర్లలో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం వాటా సుమారు 33.8 శాతం మాత్రమే కాగా.. ఏఎస్‌డీడీ జాబితాలో మాత్రం ఈ ప్రాంతం వాటా 58.6 శాతానికి చేరుకోవడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో పోలిస్తే ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య తగ్గడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతమే ప్రధాన కారణంగా కనిపిస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

హైదరాబాద్ జిల్లా విషయానికి వస్తే.. గతంలో ఉన్న ఓటర్లలో 19.4 లక్షల మంది ఏఎస్‌డీడీకేటగిరీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

మిగతాది 2 లో..

# ఒకరిని మించి మరొకరు

- కేసీఆర్, రేవంత్‌పై ఈటల ఫైర్
- భూ దోపిడీపై ఈటల సంచలన ఆరోపణలు
- రెండు ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు
- 22ఏ భూములపై ఈటల ఆగ్రహం
- భూమాఫియాకు సర్కార్ అండా?
- రేవంత్ సర్కార్‌పై ఈటల ఆరోపణలు



**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరికి ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా '22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు.

2 లో

# తప్పు ఒప్పుకున్నాం.. ధరణి సంగతేంటి?



2 లో

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** ఇది పేదల ప్రభుత్వం, వారి ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం.. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవారికి అన్యాయం చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని, వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామన్నారు.

# విద్యార్థుల విజయం..

- ప్రభుత్వ పరీక్షలన్నీ రద్దు
- హేమంత్ సర్కార్ కీలక నిర్ణయం
- 24 రోజుల ఆందోళనకు ఫలితం
- అక్రమాలపై సీఐడీ దర్యాప్తు
- టీడీపీఎల్ పరీక్షలపై వేటు
- విద్యార్థులకు ప్రభుత్వం బిగ్ రిలీఫ్



2 లో

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో జరిగిన అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలపై ప్రభుత్వం దిగి వచ్చింది. జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షతో పాటు, అవుట్ సోర్సింగ్ సంస్థ 'టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్' నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా ఆందోళన బాట పట్టిన వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించినట్లయింది. సీఎం ప్రకటనతో విద్యార్థులంతా విజయ సంబరాలు చేసుకుంటున్నారు.

# జోగి రమేష్ ఇంట్లో కుటుంబ కలహాలు



2 లో

- నెట్టింట వైరల్‌గా కుటుంబ పంచాయతీ
- కోడలు ఆరోపణలతో కలకలం
- తండ్రిపై కుమారుడి సంచలన వ్యాఖ్యలు
- కట్నం వేధింపుల ఆడియో వైరల్
- పెళ్లి విషయంలో కుటుంబ రచ్చ
- జోగి కుటుంబంపై ఆరోపణల వెల్లువ

# గాంధీపై కూడా కేసు పెట్టండి



2 లో

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గేయాలాపనకు అంతరాయం కలిగించేందుకు యత్నించారంటూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలైన పోలీసు ఫిర్యాదుపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించింది. ఈ వివాదంపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీని తీవ్రంగా విమర్శించారు. "ఒకవేళ వందేమాతరం అంశంపై కేసులు నమోదు చేయాలనుకుంటే ముందుగా మహాత్మా గాంధీపై కూడా కేసు నమోదు చేయాలి" అని వ్యాఖ్యానించారు.

# 'భూ లక్ష్మి'తో ఎకరం పంపిణీ

- పేదలకు ఎకరం భూమి హామీ
- కవిత సంచలన పథకం ప్రకటన
- రేవంత్‌పై కవిత తీవ్ర ఫైర్
- భూదోపిడీపై కవిత సంచలన ఆరోపణలు
- సామాజిక న్యాయంపై కవిత సవాల్
- అసైన్డ్ భూములపై కీలక డిమాండ్




**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని కవిత సంచలన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం లావాదేవీలే కావొచ్చు కానీ పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమీ, అడవి అంటే పంచప్రాణాలు అని రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు జరిగినా ముందుగా తీసుకుంటున్నవి అసైండ్ భూములేనని మండిపడ్డారు. రాష్ట్రంలో భూమి పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇవాళ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. రేవంత్ రెడ్డి తమ్ముళ్లు భూ దొంగలు అని అనగనగా ఒక రాజు ఏడుగురు కొడుకులు అన్నట్లుగా రేవంత్ రెడ్డి సోదరుల బూదోపిడీ సాగుతోందని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల పాలన సాగుతోందని ఇంత మంది రాజ్యాంగేతర శక్తుల దోపిడీ ఏంటని ప్రశ్నించారు. 30 వేల అసైండ్ భూములను ఈ ప్రభుత్వం లాగేసుకుందని ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉండే మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసెండ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని చాలెంజ్ చేశారు.

2 లో

# అయోధ్య విరాళాల కేసులో కీలక పరిణామం

- చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలకు క్లీన్‌చిట్
- విరాళాల చోరీలో ఆధారాలు లేవన్న సిట్
- ట్రస్ట్ పెద్దలకు సంబంధం లేదన్న దర్యాప్తు
- బ్యాంక్ ఖాతాలపై పూర్తిస్థాయి పరిశీలన
- నిరాధార ఆరోపణలకు తెరపడినట్లయింది
- అసలు నిందితులపై తదుపరి చర్యలు

# కేబినెట్ కీలక నిర్ణయం..

- బీసీలకు 34% రిజర్వేషన్
- అక్టోబర్‌లో స్థానిక ఎన్నికలు
- మేయర్లకు ప్రత్యక్ష ఎన్నికలు
- గ్రీన్ ఎనర్జీకి గ్రీన్ సిగ్నల్
- రోడ్లకు రూ.7,469 కోట్లు
- 10,060 పోస్టులకు జాబ్ క్యాలెండర్
- బీసీలకు జేఈఈ, నీట్ కోచింగ్



**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

2 లో

# పెద్ది విగ్రహం తొలగింపు.. భారీ బందోబస్తు

- అర్ధరాత్రి భారీగా పోలీసుల మోహరింపు
- గోప్యంగా విగ్రహం తరలింపు ప్రక్రియ
- వారం రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- విగ్రహం ఏర్పాటుపై కేసుల నమోదు
- పెద్ది విగ్రహం తొలగింపుతో కలకలం
- ఆరు మండలాల్లో పోలీసుల మోహరింపు

2 లో

# నీట్ ఆందోళనపై హైపవర్ కమిటీ

- నిరసనలపై సుప్రీం కీలక నిర్ణయం
- విద్యార్థులపై దాడులపై కమిటీ ఏర్పాటు
- సీసీటీవీ వీడియోలు పరిశీలించనున్న కమిటీ
- పోలీసుల బలప్రయోగంపై సుప్రీం సీరియస్
- విద్యార్థుల ఎఫ్ఐఆర్‌లపై కీలక ఆదేశాలు
- నేరచరిత్ర లేనివారికి కేసులు ఎత్తివేత

2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్
19-08-2026

# 'భూ లక్ష్మి'తో ఎకరం పంపిణీ

మొదటి పేజీ తరువాయి

**మేకవన్నే పులిలా రేవంత్ రెడ్డి:**

ప్రొఫెసర్ జయంతి సందర్భంగా తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పం తీసుకోగానే గత 31 నెలల్లో ఏనాడూ సామాజిక న్యాయం పదం ఉచ్చరించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారన్నారు. సామాజిక అన్యాయం అనబోయి సామాజిక న్యాయం అన్నారని రాష్ట్ర ప్రజలు రేవంత్ రెడ్డి మాటలను నమ్మవద్దన్నారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లోనే సామాజిక న్యాయం లేదని, పదవులు ఇచ్చే అవకాశం ఉండి కూడా ఎస్సీ ఎస్టీ, బీసీలు ఎందుకు న్యాయం చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మేకవన్నేపులిలాంటి వాడని విమర్శించారు.

**చెప్పేంది సామాజిక న్యాయం చేసేది ఆటవిక న్యాయం:**

ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సలహాదారులుగా ఒకే రోజు శివధర్ రెడ్డి, వీహెచ్ ను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇందులో బీసీ బిడ్డ వీహెచ్ జీతం శివధర్ రెడ్డి కంటే ఎందుకు తక్కువ ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషనర్లో ఒక్క బీసీ లేదన్నారు. ఆర్టీఐ కమిషనర్ భార్యకు సినిమాలతో సంబంధం లేదని ఆమెను చిత్రపురి కాలనీ మెంబర్ గా నియమించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చెప్పేంది సామాజిక న్యాయం చేసేది ఆటవిక న్యాయం అని ఆరోపించారు. లంబాడా ప్రాతినిధ్యం లేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకైక కేబినెట్ రేవంత్ రెడ్డిదేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం పేదలకు మరో న్యాయం కొనసాగుతోందన్నారు.

# ఒకరిని మించి మరొకరు..

మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. "ధరణి పోర్టల్ రద్దు చేసినా, భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఏ మార్పు రాలేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను 'సైటిల్ మెంట్' చేసుకుంటోంది" అని ఈటల విమర్శించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

గల్ఫ్ ఆయిల్ భూముల కథ ఇదీ..

గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని, ఈ అక్రమాల్లో పెద్దల హస్తం ఉందని ఎంపీ పేర్కొన్నారు. పేదలకు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ము కాయడం మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అరాచకాలను అడ్డుకునే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# జోగి రమేష్ ఇంట్లో కుటుంబ కలహాలు

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** జోగి రమేష్ కుటుంబ పంచాయతీకి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవలే వారి కుటుంబంపై కోడలు మేఘన గృహహింస సహా పలు సెక్షన్ల కింద కేసులు పెట్టింది. ఈ క్రమంలోనే కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఆమెతో పెళ్లి వద్దని అప్పుడే చెప్పాను.. అంతా నువ్వే చేశావ్.. 10 మందిని పిలిపించి నాకు బ్రెయిన్ వాష్ చేసి.. ఆ అమ్మాయి ఇంటికి తీసుకెళ్లి పెళ్లి చేశావ్ అని జోగి రమేష్ కుమారుడు తన తండ్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. అంతేకాక.. భార్య మేఘనతో మాట్లాడిన ఫోన్ కాల్ రికార్డింగ్ సహా.. ఇంటిలో ఇరు కుటుంబాల మధ్య జరుగుతున్న పంచాయతీకి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.

అసలు తన భర్త కాపురానికి పనికిరాడని, అన్నీ దాచిపెట్టి మోసం చేసి పెళ్లి చేసి తన జీవితాన్ని నాశనం చేశారని మేఘన ఆరోపిస్తోంది. రెండు రాష్ట్రాలకు తెలిసేలా పెళ్లిచేసినట్లే.. రెండు రాష్ట్రాలకూ తెలిసేలా తెగదెంపులు జరగాలని డిమాండ్ చేస్తోంది. కాపురానికి పనికిరాని కొడుకుతో .. వాళ్ల పలుకుబడి, రాజకీయం కోసం పెళ్లి చేశారని ఆరోపిస్తోంది. అంతేకాక జోగి రమేశ్ భార్య శకుంతల.. కోడలు మేఘనను ఇంకా కట్నం తీసుకుని రావాలని వేధించిన ఆడియో కూడా బయటికి వచ్చింది. తన కుమారుడికి బంగారం కూడా కొనలేదని, కారు కొనాలని, వ్యాపారానికి రూ.2 కోట్లు ఇవ్వాలని శకుంతల బెదిరించినట్లుగా ఆ ఆడియోలో తెలుస్తోంది. అయితే నిశ్చితార్థం సమయంలోనే గొలుసు, పెళ్లి సమయంలో కడియం పెట్టామని, మిగతా వాటి గురించి తనకు తెలియదని బదులిచ్చింది.

మరో వీడియోలో జోగి రాజీవ్.. భార్య మేఘనపై ఫైరయ్యాడు. నీకు జరిగింది అన్యాయమే కానీ.. నీకున్నంత నొప్పి నాకు ఉండదు అర్థమయిందా? అని అనడంతో.. మేఘన తండ్రి ఆగ్రహానికి గురయ్యారు. ఇలా వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటి పంచాయతీ అంతా.. సోషల్ మీడియాలో రచ్చకెక్కినట్లయింది.

# తప్పు ఒప్పుకున్నాం.. ధరణి సంగతేంటి?

మొదటి పేజీ తరువాయి

మంగళవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోసారి స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, 24 గంటల్లోనే మేడ్చల్ జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 వంతున రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్ర స్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతుందన్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించామన్నారు. అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు. వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయన్నారు.

కమిటీ ఏర్పాటు చేశాం..

రాష్ట్రంలో 22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి అన్నారు. రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కావాలనే 22ఏలో భూములు పెట్టి, వాటిని తొలగించడానికి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి ఘాటుగా స్పందించారు. "విమర్శలు చేయడం చాలా సులువు.. కానీ బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ విషయంలో పొరపాటు జరిగిందని మేం బహిరంగంగా అంగీకరించాం.. ఆ పొరపాటును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నాం. వారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ధరణి పేరుతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు, జరిగిన తప్పులకు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా?" అని ప్రశ్నించారు. ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా? అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావుకు ఇప్పటికీ 30 శాతం కమీషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసు. వాళ్లు ఏ పద్ధతిలో పాలన సాగించారో ప్రజలు మరిచిపోలేదు. ఇప్పుడు పేదల సమస్యను పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం చాలా సులభం. కానీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో కూడా సమాధానం చెప్పాలని మంత్రి అన్నారు. కాళేశ్వరం విషయంలో జరిగిన పరిణామాలకు హరీశ్ రావు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? ఇప్పుడు నేను మాత్రం నా శాఖలో పొరపాటు జరిగిందని చెప్పి, దానికి పరిష్కారం చూపేందుకు బాధ్యత తీసుకుంటున్నాను. ఇదే తేడా అని మంత్రి స్పష్టం చేశారు.

ఆధారాలు చూపాలి..

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి స్పందించారు. తాటాకు చప్పుళ్లకు నేను భయపడను. నాపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. ఆధారం ఉంటే ప్రజల ముందు పెట్టాలి. ఫీనిక్స్, రాఘవ తదితర సంస్థలతో వ్యాపార రంగంలో లావాదేవీలు జరగడం సహజం. వాటిని పట్టుకుని రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నాను. అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చానన్నారు. ఒక్కరోజులో రూ.వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాదు. నా వ్యాపార ప్రస్థానం, నా నేపథ్యం గురించి ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. ఆరోపణలు చేసేవారు ముందుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని మంత్రి హితవు పలికారు.

# విద్యార్థుల విజయం.. ప్రభుత్వ పరీక్షలను రద్దు చేసిన సర్కార్

మొదటి పేజీ తరువాయి

2014 నుండి టీడీపీఎల్ సంస్థ చేపట్టిన అన్ని నియామక పరీక్షలు, వాటి ఫలితాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2014 నుండి నియామక పరీక్షల్లో జరిగిన చిన్న, పెద్ద పొరపాట్లు, అక్రమాలపై సిఐడి ద్వారా సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు. విచారణలో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతుండటంతో వివరాలను బయటపెట్టలేమని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడానికి, భవిష్యత్తులో అక్రమాలు జరగకుండా నిరోధించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాభ్ కౌశల్ ఆధ్వర్యంలో ఒక సంస్కరణల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లుపై చర్చించేందుకు అవసరమైతే శాసనసభ ప్రత్యేక సమావేశాలను సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అంతకుముందు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌కు ఆందోళన చేస్తున్న విద్యార్థుల ప్రతినిధులను నేరుగా కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లేఖ రాశారు. రాజ్యాంగం ప్రసాదించిన శాంతియుత నిరసన హక్కుకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అక్రమాలపై పోరాడుతున్న యువతకు అండగా ఉంటామని ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత 24 రోజులుగా అభ్యర్థులు చేపట్టిన నిరసనలు, ఆకలి సత్యాగ్రహాలు, విపక్షాల ఒత్తిడి నేపథ్యంలో, సోమవారం నాటి ప్రత్యేక క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయాలను తీసుకుంది.

# అయోధ్య విరాళాల కేసులో కీలక పరిణామం



**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల చోరీ, నిధుల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఆరోపణల కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక ప్రకటన చేసింది. ఈ కేసులో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రాలకు సిట్ క్లీన్‌చిట్ ఇచ్చింది. విరాళాల వ్యవహారంలో వీరిద్దరి ప్రమేయం ఉన్నట్లుగా ఎలాంటి ఆధారాలు లభించలేదని సిట్ తన దర్యాప్తు నివేదికలో స్పష్టం చేసింది. గతంలో విరాళాల నిధుల నిర్వహణపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కేసును సమగ్ర దర్యాప్తు కోసం సిట్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే.

ఈ కేసుకు సంబంధించిన అన్ని ఆర్థిక లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే దర్యాప్తు అధికారులు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చోరీకి గురైన నిధులు, బ్యాంక్ లావాదేవీలకు ట్రస్ట్ ఉన్నతాధికారులకు ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధం లేదని సిట్ అధికారులు తేల్చారు. ఈ క్లీన్‌చిట్‌తో ట్రస్ట్ ప్రతినిధులపై వచ్చిన నిరాధార ఆరోపణలకు తెరపడినట్లయింది. ఈ కేసులో అసలు నిందితులపై చట్టపరమైన తదుపరి చర్యలను కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కేబినెట్ కీలక నిర్ణయం..

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది.

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అలానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.1 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లను పెంచే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసిన నేపథ్యంలో కేబినెట్ నిర్ణయంకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్‌లోగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు నష్టపోకుండా ఉండేందుకు ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన అవసరాన్ని కేబినెట్ పరిగణనలోకి తీసుకుంది.

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తూ.. ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ప్లాంట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ ఆధ్వర్యంలో సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడ ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన రంగంలో హైబ్రిడ్, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అమరావతి రైల్వే లైన్ కోసం భూసేకరణ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన అంశంపైనా నిర్ణయం తీసుకుంది. హ్యామ్ మోడల్‌లో రూ.7,469.46 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగాల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ఆమోదం తెలిపింది. బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ పరీక్షల శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ ఏర్పాటు చేసే బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులకు మార్గం సుగమం కానుంది. ఏపీఎస్‌బీసీఎల్‌కు రూ.5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణం ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అవయవ మార్పిడికి సంబంధించిన ట్రాన్స్‌ప్లాంటేషన్ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 నీటి ప్రాజెక్టులపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది.

# గాంధీపై కూడా కేసు పెట్టండి

మొదటి పేజీ తరువాయి

అసలు ఏమిటీ వివాదం?

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతరం గేయం ఆలాపిస్తున్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేల మధ్య సంభాషణలు, సైగలు జరిగాయని, ఇది జాతీయ గేయాన్ని అసమానించడమేనంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అనంతరం ఈ విఘాతంపై సోనియా, రాహుల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా స్వీకరించాలని నిర్ణయించిందని, ఆ కమిటీ సమావేశానికి మహాత్మా గాంధీ కూడా అధ్యక్షత వహించారని గుర్తుచేశారు. అందువల్ల వందేమాతరం విషయంలో ఫిర్యాదులు చేయాలనుకుంటే, ఆనాడు చారిత్రక నిర్ణయం తీసుకున్న మహాత్మా గాంధీతో పాటు ఇతర స్వాతంత్ర్య సమరయోధులపై కూడా కేసు నమోదు చేయాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, జాతీయ ఆర్ఎస్ఎస్ వేదికలపై 'వందేమాతరం' పాడకుండా కేవలం తమ ప్రార్థనలకే ప్రాధాన్యత ఇస్తారని, అలాంటిది బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# నీట్ ఆందోళనపై హైపవర్ కమిటీ



**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** ఢిల్లీలో జూలై 20న జరిగిన నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాలు, అక్రమాలపై విచారణ జరిపేందుకు ఒక హై పవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. రిటైర్డ్ న్యాయమూర్తులు, మాజీ డీజీపీ, సీబీఐ మాజీ డైరెక్టర్లతో కూడిన ఈ కమిటీ నిరసనల రోజు నాటి సీసీటీవీ, వీడియో దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుందని చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ప్యానెల్‌లో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు అందిన తర్వాత, కమిటీని ఏర్పాటు చేసేందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేస్తామని ధర్మాసనం తెలిపింది.

ఎల్లుండి వరకు ఇవ్వండి: కమిటీకి మౌలిక సదుపాయలను సుప్రీంకోర్టు కల్పించనుంది. ఈ మేరకు జూలై 20 నాటి పార్లమెంట్ మార్చ్‌కి సంబంధించిన అన్ని వీడియోలు, సీసీటీవీ రికార్డింగ్‌లను ఈ కమిటీకి అందజేయాలని సుప్రీంకోర్టు పోలీసులను ఆదేశించనుంది. ఆందోళనల సమయంలో మహిళా నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారనే ఆరోపణలను కూడా ఈ హై పవర్ కమిటీ ప్రధానంగా పరిశీలిస్తుంది. బాధితులందరి వాదనలను ఈ కమిటీ వింటుందని కమిటీ సిఫార్సుల ఆధారంగా చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

ఎఫ్ఐఆర్ లు సమర్పించండి: ఆందోళనల నేపథ్యంలో విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను సమర్పించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమకు ఉన్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ కేసులను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. విద్యార్థుల భవిష్యత్తు ఎంతో ముఖ్యం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు వారికి ఉందని ధర్మాసనం పేర్కొంది.

నేరచరిత్ర లేని వారికి ఊరట: గతంలో తీవ్రమైన నేరచరిత్ర లేని సాధారణ విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంటే, అటువంటి కేసులను మూసివేయవచ్చని కోర్టు స్పష్టం చేసింది. శాంతియుత ఆందోళనలు జరుగుతున్నప్పుడు పోలీసులు లాఠీఛార్జ్ చేయడం లేదా మితిమీరిన బలాన్ని ఉపయోగించడాన్ని సమర్థించలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ఓటర్ల లెక్కల్లో భారీ ట్విస్ట్!

మొదటి పేజీ తరువాయి

ఇది జిల్లాలోని పాత ఓటర్లలో సుమారు 40.9 శాతమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏఎస్‌డీడీ ఓటర్లలో హైదరాబాద్ జిల్లా వాటా దాదాపు 26.4 శాతంగా ఉంది. గతంలో హైదరాబాద్ జిల్లాలో సుమారు 47.3 లక్షల మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 27.9 లక్షల మంది ఏఎస్‌డీడీ కేటగిరీలోకి రాలేదు. హైదరాబాద్ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎం స్థానాల్లో కలిపి 9.4 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నారు. ఇది ఆయా నియోజకవర్గాల్లోని మొత్తం ఓటర్లలో సుమారు 39.4 శాతం అని తెలుస్తోంది. అయితే ఏఎస్‌డీడీ ఓటర్ల తొలగింపు కేవలం పాతబస్తీ లేదా ఎంఐఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే పరిమితం కాలేదని గణాంకాలు సూచిస్తున్నాయి.

హైదరాబాద్‌తో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలను కలిపి చూస్తే ఏఎస్‌డీడీ ఓటర్ల సంఖ్య మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ 3 జిల్లాల్లో జూన్ 10వ తేదీ నాటికి సుమారు 1.1 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వారిలో దాదాపు 37.67 శాతం మంది ఏఎస్‌డీడీ కేటగిరీలో ఉన్నారు. 3 జిల్లాల్లో హైదరాబాద్‌లో ఏఎస్‌డీడీ శాతం అత్యధికంగా సుమారు 40 శాతంగా ఉంది. మేడ్చల్-మల్కాజిగిరిలో 29.7 లక్షల మందిలో 10.7 లక్షల మంది (35.9 శాతం) ఏఎస్‌డీడీ కేటగిరీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలోని 36.9 లక్షల మందిలో 12.8 లక్షల మంది (34.7 శాతం) ఈ జాబితాలో ఉన్నారు. వికారాబాద్‌లో ఈ శాతం 20.6గా ఉండటం.. హైదరాబాద్ మెట్రో ప్రాంతానికి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సూచిస్తోంది.

ఈ ఏఎస్‌డీడీ కేటగిరీలో 3 మెట్రో జిల్లాల్లోనూ శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లే అత్యధికంగా ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో 13.4 లక్షల మంది.. మేడ్చల్-మల్కాజిగిరిలో 7.9 లక్షల మంది.. రంగారెడ్డిలో 7.7 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లుగా గుర్తించినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ మూడు జిల్లాల్లో కలిపి ఈ సంఖ్య 29.1 లక్షలుగా ఉన్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

మెట్రో పరిధిలోని కొన్ని నియోజకవర్గాల్లో ఏఎస్‌డీడీ ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షల మంది ఏఎస్‌డీడీ కేటగిరీలో ఉండగా.. ఇది ఆ నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో 42.6 శాతంగా తేలింది. లాల్‌బహదూర్‌నగర్‌లో 2.7 లక్షలు (44.4 శాతం).. రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు (38.8 శాతం), మహేశ్వరంలో 2.3 లక్షలు (40.9 శాతం) మంది ఏఎస్‌డీడీ కేటగిరీలో ఉన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉప్పల్‌లో 2.1 లక్షల మంది (39.8 శాతం), మల్కాజిగిరిలో 1.9 లక్షలు (37.6 శాతం), కుత్బుల్లాపూర్‌లో 2.7 లక్షలు (37 శాతం), కూకట్‌పల్లిలో 1.7 లక్షలు (34.5 శాతం), మేడ్చల్‌లో 2.1 లక్షలు (31.4 శాతం) ఏఎస్డిడి కేటగిరీలో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా చూస్తే.. హైదరాబాద్ జిల్లాలో ఏఎస్‌డీడీ శాతం అత్యధికంగా ఉండగా.. వేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాలైన శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, లాల్‌బహదూర్‌నగర్, రాజేంద్రనగర్ వంటి నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో ఓటర్లు ఏఎస్‌డీడీ జాబితాలోకి వెళ్లారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలోని ఈ గణాంకాలు హైదరాబాద్ ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న భారీ మార్పులను సూచిస్తున్నాయి.

# పెద్ది విగ్రహం తొలగింపు.. భారీ బందోబస్తు

**న్యూస్ డెస్క్, 18 ఆగష్టు ( బిఎన్ఎస్):** నర్సంపేట మాజీ శాసనసభ్యులు, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం వేకువజామున అధికారులు తొలగించినట్లు తెలుస్తోంది. అర్థరాత్రి నుంచి పెద్ద మొత్తంలో బలగాలు ఆస్పత్రి పరిసరాలు సహా పాకాల రోడ్ వైపుగా మోహరించారు. పెద్ది విగ్రహాన్ని అక్కడ నుండి తరలించినట్లు సమాచారం. గద్దెను పూర్తిగా కూల్చివేశారు. సిమెంట్ ఇటుకలను అక్కడ నుండి దూరంగా తరలించారు. దగ్గరలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సైతం ఫోన్లు వాడేందుకు అధికారులు నిరాకరించినట్లు తెలుస్తోంది. విగ్రహం తొలగింపు ప్రక్రియ అత్యంత గోప్యంగా పోలీసుల పహారాలో చేపట్టారు. సమాచారం తెలుసుకుని అక్కడికి వెళ్తున్న వారిని మధ్యలోనే అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

వారం నుండి ఉద్రిక్తతలు...

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో చికిత్స పొందుతూ జులై 31న యశోద ఆస్పత్రిలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెద్ది దశ దిన కర్మ రోజున మెడికల్ కాలేజీ దగ్గర విగ్రహం పెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ముందు రోజు మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రైవేటు స్థలంలో విగ్రహ ఏర్పాటుకు గద్దెను నిర్మించారు. ఇది అసైన్డ్ భూమి అని కొంత చర్చ జరిగిన సంగతి తెలిసిందే. కాగా మున్సిపల్ నుండి అనుమతులు లేవని గద్దెను మున్సిపాలిటీ అధికారులు కూల్చారు. అనంతరం ముందస్తు సమాచారం లేకుండా కూల్చడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ సెంటర్ లో బీ.ఆర్.ఎస్ శ్రేణులు ధర్నా చేశారు.

అదే రోజు సాయంత్రం విగ్రహ ప్రతిష్ట చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ సహా పలువురి పై కేసులు నమోదు అయ్యాయి. మరుసటి రోజు విగ్రహం తొలగిస్తారని ప్రచారం జరిగినా అలాంటి ఘటన చోటు చేసుకోలేదు. వారం రోజులుగా పోలీసు సిబ్బంది షిఫ్ట్ ల వారీగా మెడికల్ కాలేజీ పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన వల్ల ఆలస్యం జరిగినట్లు తెలుస్తోంది. పెద్ది విగ్రహం తొలగింపుతో పరిస్థితులు ఉద్రిక్తతగా మారే అవకాశం ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల్లో పోలీసు బలగాలను మోహరిస్తున్నారు.

# కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది...

## ప్రజా విశ్వాసమే ప్రభుత్వానికి బలం

**మద్దెలమడుగు ఇంద్రకాలనీలో జరిగిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పచ్చిగళ్ళ రత్నయ్య 75 వా బూత్ కన్వీనర్ సమయం ప్రసాద్**

నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):–ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ మరియు యూనిట్ ఇంచార్జ్ పచ్చిగళ్ళ రత్నయ్య పేర్కొన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, పెంచలకోన చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాపూరు మండలం ఇంద్రకాలనీలో గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని కరపత్రాలను అందజేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2.0, అన్నదాత సుఖీభవ, పెంచిన పింఛన్లు తదితర పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులనూ ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. అప్పుడు జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేయడానికే చాలా సమయం పట్టిందన్నారు. అయినా ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 75వ బూత్ కన్వీనర్ సమయం ప్రసాద్, చింతగుంట శినయ్య కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గండూరుపల్లి, తాతిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని గండూరుపల్లి, తాతిపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం రాపూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి సోముసుందర్ మరియు వ్యవసాయ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నేడు నిర్వహించబోయే 'అగ్రి ఎక్స్‌పో మరియు కిసాన్ మేలా' కార్యక్రమానికి సంబంధించి రైతులకు కీలక సమాచారాన్ని అందించారు. ఈ మేలాలో వ్యవసాయం మరియు దాని అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు పాల్గొంటారని, రైతులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, నూతన యంత్రాల వాడకంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.?ఈ ప్రత్యేక అగ్రి ఎక్స్‌పో, కిసాన్ మేలా కార్యక్రమానికి రాపూరు మండలం మరియు పరిసర ప్రాంతాల రైతు సోదరులందరూ అధిక సంఖ్యలో హాజరై, శాస్త్రవేత్తల సలహాలు పొంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

# మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి సీఎం చంద్రబాబు సానుకూల స్పందన.!!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 18:

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008 లో ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, ఇప్పటికీ తాత్కాలిక టిన్ షెడ్లలోనే కొనసాగుతున్న విషయాన్ని ఎమ్మెల్యే పుట్టా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, పరిపాలనా విభాగం, అధ్యాపకుల గదులు, ఐసీటీ సదుపాయాలు, పరీక్షా గదులు, విద్యార్థుల మౌలిక సదుపాయాలతో కూడిన ఆధునిక శాశ్వత భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పుట్టా కోరారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సానుకూల స్పందన పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనం నిర్మాణం పూర్తయితే మైదుకూరు నియోజకవర్గంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యలో మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 18 ఏళ్లుగా తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం కల్పించడం నా ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూల స్పందనతో ఈ చిరకాల సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉంది అని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు.



# నెల్లూరు జిల్లాలో మెగా రుణమేళా నిర్వహణకు బ్యాంకర్లకు సూచన




నెల్లూరు జిల్లా నెల్లూరు కలక్టరేట్(బిఎన్ఎస్ ):– నెల్లూరు జిల్లాలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాల సబ్సిడీలను మరింత దగ్గర చేసేందుకు మెగా రుణమేళా నిర్వహించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా యంత్రాంగానికి సూచించారు. బ్యాంకులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (DLRC) సమావేశంలో ఎంపీ మాట్లాడారు. జాయింట్ కలెక్టరు మొగిలి వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం) మణిశేఖర్, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డి.డి.ఎం) డాక్టర్ బాబు , 27 బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వానపల్లి రీ-సర్వేలో అక్రమాలపై ఫిర్యాదులు

## ఎంజాయిమెంట్‌కు విరుద్ధంగా సర్వేలు చేస్తున్నారంటూ రైతుల ఆరోపణలు --

కొత్తపేట: (బిఎన్ఎస్)ఆగస్టు :18 కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో నిర్వహించిన రీ-సర్వేలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ న్యాయవాది ఎం.వి. సుబ్బారావుతో పాటు పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రీ-సర్వే పేరుతో వాస్తవ భూ అనుభవానికి విరుద్ధంగా కొలతలు, సరిహద్దులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.

న్యాయవాది ఎం.వి. సుబ్బారావు తన ఆధీనంలో ఉండి, ఇనుప కంచెతో రక్షించుకున్న భూమిలో కొంత భాగాన్ని పొరుగు రైతు ఖాతాలోకి మార్చినట్లు ఆరోపించారు. తాను చాలా కాలంగా భూమిని సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నప్పటికీ, రీ-సర్వే నిర్వహించే ముందు తనకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని పేర్కొన్నారు.

తన వాస్తవ అనుభవంలో ఎకరా 29 సెంట్ల భూమి ఉండగా, రీ-సర్వే అనంతరం రికార్డుల్లో భూమి విస్తీర్ణం తగ్గించి చూపించారని సుబ్బారావు ఆరోపించారు. అంతేకాకుండా, తన పాస్‌బుక్‌లో తన ఫోటో స్థానంలో వేరే రైతు ఫోటోను ఉంచడంతో పాటు భూమి వివరాల్లో కూడా మార్పులు చేసినట్లు పేర్కొంటూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (జజుూూ) కు ఫిర్యాదు చేశారు.

ఇదే గ్రామానికి చెందిన రైతు ధోనబోయిన పండు కూడా రీ-సర్వేలో తమ వాస్తవ భూ అనుభవానికి విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రీ-సర్వే అనేది వాస్తవ భూ అనుభవం, సరిహద్దులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్వహించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కొలతలు నమోదు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ధోనబోయిన పండు ఫిర్యాదుపై తహసీల్దార్ వెంటనే స్పందించి సిబ్బందితో భూమిని కొలిపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సమస్యను గుర్తించడంతో రైతు పండు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకున్న తహసీల్దార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఫిర్యాదులపై తహసీల్దార్ స్పందిస్తూ, రీ-సర్వేకు సంబంధించిన లాగిన్ రాగానే రికార్డులను పరిశీలించి, గుర్తించిన తప్పులను నిబంధనల ప్రకారం సరిచేస్తామని తెలిపారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేపడతామని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ Survey and Boundaries Act, 1923లోని Section 6 ప్రకారం సర్వేకు సంబంధించిన భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తులకు నోటీసు ఇచ్చి, నిర్ణీత సమయంలో హాజరై సరిహద్దులను చూపించేందుకు, సంబంధిత సమాచారాన్ని అందించేందుకు అవకాశం కల్పించాల్సి ఉంటుందని న్యాయవాది సుబ్బారావు పేర్కొన్నారు. సరిహద్దుపై వివాదం ఉంటే Section 10 ప్రకారం విచారణ నిర్వహించి నిర్ణయానికి కారణాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.



రీ-సర్వేలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వాస్తవ భూ అనుభవం, FMB, పాత సర్వే రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర ఆధారాలను పరిశీలించి సరైన విస్తీర్ణాన్ని అధికారిక రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని న్యాయవాది కోరారు.

వానపల్లి రీ-సర్వేలో ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించడం ద్వారా రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

# వందేమాతరం.. అప్పుడు బ్రిటీషర్లు.. ఇప్పుడు కాంగ్రెస్ భయపడుతోంది: బండి సంజయ్



హైదరాబాద్, బిఎన్ఎస్: కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# మత్స్యకారులు గల్లంతు.. గాలింపు ఎప్పుడో?



అమలాపురం (బిఎన్ఎస్)ఆగస్టు 18 : ఆగస్టు 3న సముద్రంలోకి వెళ్లిన ఎనిమిది మంది మత్స్యకారులు ఆగస్టు 12న తిరిగి రావాల్సి ఉండగా గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతుండగా, అధికారుల గాలింపు చర్యలు ఆలస్యంగా ప్రారంభం కావడంపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు నిర్ణీత సమయానికి తిరిగి రాకపోతే, వారి భద్రతపై అనుమానాలు తలెత్తడం సహజం. ముఖ్యంగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో ఇటువంటి ఘటనలను అత్యంత సున్నితమైన అత్యవసర పరిస్థితిగా పరిగణించాల్సిన అవసరం ఉంది. కానీ ఎనిమిది మంది మత్స్యకారులు తిరిగి రాకపోయినప్పటికీ, వారి కోసం గాలింపు చర్యలు దాదాపు పది రోజుల తర్వాత ప్రారంభించడంపై అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### పది రోజుల ఆలస్యం ఎందుకు?

మత్స్యకారుల ప్రాణాలకు సంబంధించిన విషయంలో ఒక్కో గంట కూడా ఎంతో విలువైనది. పడవ ప్రమాదానికి గురై ఉండవచ్చు, ఇంజిన్ పనిచేయక సముద్రంలో చిక్కుకుని ఉండవచ్చు, లేదా సముద్ర ప్రవాహాల కారణంగా ఇతర ప్రాంతాలకు కొట్టుకుపోయి ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రారంభ దశలోనే సమర్థవంతమైన గాలింపు చేపట్టడం అత్యంత కీలకం.

అయితే గాలింపు చర్యలు ఆలస్యంగా ప్రారంభమైతే, మత్స్యకారుల ఆచూకీ గుర్తించడం మరింత కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో "సమాచారం అందిన వెంటనే అధికారులు ఎందుకు స్పందించలేదు?", "తక్షణ గాలింపు చర్యలు ఎందుకు చేపట్టలేదు?" అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

# యువతే దేశానికి మూలస్తంభం: బండ్లగూడజాగీర్‌లో ఘనంగా 'యువ సమ్మేళనం'



బండ్లగూడజాగీర్ లోని శారదాధామం ప్రాంగణంలో 'యువ సమ్మేళనం' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సమాజంలో యువత పాత్రను పునరుద్ఘాటిస్తూ నిర్వహించిన ఈ వేడుకకు స్థానిక ప్రాంతం నుండి విశేష స్పందన లభించింది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) జన్మ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నేటి యువతలో దేశభక్తి భావనను నూరిపోయడం, సామాజిక బాధ్యతలను గుర్తుచేయడం మరియు మన సనాతన హిందూ సంస్కృతిపై సరైన అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమ్మేళనం సాగింది.

కార్యక్రమ ప్రారంభం ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. సంపూర్ణ వందేమాతర గీతాలాపనతో సభను ప్రారంభించగా, అనంతరం నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం ప్రాంగణంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.

కార్యక్రమంలో భాగమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశేషంగా ఏర్పాటు చేసిన పేరిణి నృత్య ప్రదర్శనలు తిలకించిన వారిని మంత్రముగ్ధులను చేశాయి. యువత చేసిన ఉత్సాహవంతమైన దేశభక్తి నినాదాలతో ప్రాంగణమంతా హోరెత్తింది.

దేశ నిర్మాణంలో యువశక్తి భాగస్వామ్యం వహించాల్సిన అవసరాన్ని గుర్తింపజేసే ఈ సమ్మేళనానికి సుమారు 300 మందికి పైగా యువకులు హాజరయ్యారు. నేటి యువతే రేపటి దేశానికి నాయకులుగా ఎదుగుతారని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్తలుగా సంఘ ప్రచారకులు, సామాజిక సమరసతా ప్రాంత సంయోజకులు అప్పాల ప్రసాద్ మరియు భాగ్యనగర సంభాగ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రచారకులు ఓంప్రకాశ్ హాజరై యువతను ఉద్దేశించి దిశానిర్దేశం చేశారు. దేశ పురోగతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

లంగర్ హౌజ్ నగర విద్యార్థి కళాశాల ప్రముఖుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

స్థానిక బండ్లగూడజాగీర్, కిస్మత్పూర్, లంగరౌజ్ పురప్రముఖులు నీరుడు శేఖర్, నీరుడు పవన్ సాయి, సుధీర్ యాదవ్, బోగి పరమేశ్, బుర్ర అభినయ్ గౌడ్, రాహుల్ రెడ్డి, అనురాధా చందగారి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారని బండ్లగూడజాగీర్ సహబస్తీప్రముఖ్ సి. రాజారెడ్డి తెలిపారు. అనంతరం జాతీయగీతాలాపనతో సమ్మేళనం ముగిసింది.






# సినిమా న్యూస్

## వాయిదా రూమర్స్‌కు చెక్!

సూపర్ స్టార్ రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'జైలర్' ఎలాంటి విజయాన్ని అందుకుందో అందరికి తెలిసిందే. వరుస పరాజయాలు తర్వాత రజినీకాంత్‌కు సాలిడ్ కమ్ బ్యాక్ ఇచ్చిన మూవీ జైలర్. బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఇప్పుడు 'జైలర్-2' రాబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ఎంతగానో ఆకట్టుకోగా.. భారీ అంచనాలు మధ్య అక్టోబర్ 15న రాబోతున్నట్లు ఇప్పటికే టీమ్ అఫీషియల్‌గా ప్రకటించారు. కానీ, కొన్ని అనివార్య కారణాల చేత ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిందని, అక్టోబర్ 15న రిలీజ్ కావడం కష్టం అంటూ పుకార్లు షికార్లు చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఈ వార్తలపై సినిమా టీమ్‌కు సంబంధించిన కొందరు స్పందిస్తూ.. 'జైలర్-2 వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. మా సమాచారం ప్రకారం, ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అక్టోబర్ 15న 'జైలర్-2'తో మునుపెన్నడూ లేని థియేట్రికల్ అనుభూతిని పొందేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ తెలిపారు. ప్రజెంట్ ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా.. సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.




## వెంకీ-కళ్యాణ్ రామ్ టైటిల్ ఇదేనా?

హిట్ మిషన్ అనిల్ రావిపూడి ప్రస్తుతం విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా, కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు టైటిల్‌ను మాత్రం కన్ఫామ్ చేయలేదు. దాంతో ఈ మూవీకి ఫలానా టైటిల్‌ను అనుకుంటున్నారంటూ కొన్ని పేర్లు వైరల్ అవుతున్నాయి.




కొంతకాలం క్రితం ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఓ వార్త వైరల్ అయింది. అయితే మూవీ బృందం దీనిపై పెద్దగా స్పందించలేదు. తాజాగా ఈ సినిమాలో వెంకటేష్‌కు కళ్యాణ్ రామ్ బామ్మర్ది పాత్రలో కనిపించనున్నట్లు, అలాగే కళ్యాణ్ రామ్ పాత్ర పేరు బాల్‌రెడ్డి కావడంతో 'బామ్మర్ది బాల్‌రెడ్డి' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అన్నీ ఓకే అయితే ఇదే టైటిల్‌ను కన్ఫామ్ చేసి అధికారికంగా ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మరి మేకర్స్ 'జనవరి 12 విడుదల', 'బామ్మర్ది బాల్‌రెడ్డి' అనే రెండు టైటిల్స్‌లో దేని వైపు మొగ్గు చూపుతారో.. లేక కొత్త టైటిల్‌ను ఫిక్స్ చేస్తారో అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## 'ఇరుముడి' సెన్సార్ పూర్తి!





మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజాగా మూవీ టీమ్ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు నుంచి ఈ చిత్రానికి 'ఖ/యూ' సర్టిఫికెట్ లభించింది. ఈ విషయాన్ని మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రానికి 2 గంటల 25 నిమిషాల రన్‌టైమ్‌ను లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

దీంతో చాలాకాలంగా వరుస అపజయాలతో కెరీర్‌ను కొనసాగిస్తున్న రవితేజకు ఈ సినిమాతో మంచి విజయం దక్కే అవకాశాలు ఉన్నాయని ఆయన అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో ప్రియ భవానీ శంకర్, రవితేజకు భార్య పాత్రలో నటించగా, బేబీ నక్షత్ర కూతురు పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, స్వాసిక తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు.

## 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..

తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టి ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న మొదటి ప్రతిష్టాత్మక చిత్రం 'సిగ్మా'. పూర్తి స్థాయి యాక్షన్, అడ్వెంచర్, ట్రెజర్ హంట్ హేస్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ భారీ చిత్రంలో వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకునే యంగ్ హీరో సందీప్ కిషన్, గ్లామరస్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్నారు. కోలీవుడ్‌లో ఎన్నో ప్రతిష్టాత్మక చిత్రాలను నిర్మించిన లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ ఈ సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తుండగా, టాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు, షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిజానికి జూలై 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉంది. కానీ, జూలై 23న తన తండ్రి విజయ్ నటించిన చివరి సినిమా 'జన నాయగన్' థియేటర్లలోకి రావడంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రి సినిమాకు పోటీగా నిలబడటం ఇష్టం లేక జాసన్ సంజయ్ ఎంతో చాకచక్యంగా తన సినిమా విడుదలను వాయిదా వేశారు.

అయితే ఆ తర్వాత 'సిగ్మా' సినిమా విడుదల ఇప్పట్లో ఉండదని, ప్రాజెక్ట్ ఆలస్యం అవుతోందంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. ఈ పుకార్లన్నింటికీ చెక్ పెడుతూ మూవీ మేకర్స్ తాజాగా పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో అభిమానుల ముందుకు వచ్చారు. గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది అక్టోబర్ 2న 'సిగ్మా' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అలాగే "అక్టోబర్ 2న జరగబోయే ఆ భారీ దోపిడీ కోసం తేదీని గుర్తుంచుకోండి. సిగ్మా వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉంది" అనే క్యాప్షన్ జత చేశారు. ఇక ఈ అనౌన్స్‌మెంట్‌తో పాటు హీరో సందీప్ కిషన్‌కు సంబంధించిన ఒక క్యూరియోసిటీని పెంచే పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సందీప్ కిషన్ తన గది కిటికీ నుంచి బయటకు పవర్ ఫుల్ లుక్‌తో చూస్తుండగా, ఆయన పక్కనే ఒక పెంపుడు కుక్క కూడా నిల్చొని ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ఒక్కసారిగా సినిమాపై విపరీతమైన హైప్‌ను క్రియేట్ చేసింది.




## సంక్రాంతి బరిలో మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా 158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది.

మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ - శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్ - శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ 'SYG (సంబరాల ఏటిగట్టు) సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



## వివాదంలో సాయి దుర్గా తేజ్

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ స్వామివారిని దర్శించుకోవడానికి కాణిపాకం వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత గెస్ట్ హౌస్‌లో ఉన్నారు. అయితే ఆగస్ట్ 22న జరగనున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని సాయి ధుర్గా తేజ్ అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు సంబరాలు జరుపుకున్నారు. అయితే ఈ వేడుకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో బయటకు రావడంతో నెటిజన్లు, భక్తుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దేవుడి సన్నిధి, పవిత్రమైన పుణ్యక్షేత్ర ప్రాంగణాలలో ఇలాంటి పాశ్చాత్య సంస్కృతి వేడుకలు జరపడం ఆలయ సాంప్రదాయాలకు, నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని భక్తులు మండిపడుతున్నారు. కేక్ కటింగ్స్ చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



మరోవైపు ఈ వ్యవహారంలో కాణిపాకం ఆలయ అధికారుల వైఖరిపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ భక్తులు ఆలయానికి వస్తే అనేక కఠిన నిబంధనలను అమలు చేసే అధికారులు, సినీ ప్రముఖులు,విఐపిల విషయానికి వచ్చేసరికి ఆ నిబంధనలను ఎందుకు పక్కన పెడుతున్నారంటూ భక్తులు నిలదీస్తున్నారు. ఆలయ గెస్ట్ హౌస్‌లో కేక్ కట్ చేయడానికి అసలు అనుమతులు ఎలా ఇచ్చారంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య భక్తులకు ఒక న్యాయం, సెలబ్రిటీలకు మరొక న్యాయం అమలు చేయడం ఏంటని నెటిజన్లు సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన పుణ్యక్షేత్రాల ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించేలా ప్రవర్తించిన సాయి ధుర్గా తేజ్‌తో పాటు, అందుకు సహకరించిన ఆలయ పాలకమండలి అధికారులు కూడా భక్తులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.